సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 18 । జూలై । 2023



రెండు నెలల శ్రావణం !

ఏటా నెల పాటు మాత్రమే ఉండే శ్రావణ మాసం ఈ ఏడాది రెండు నెలలు ఉండనుంది. నేటి నుంచి అధిక మాసం ప్రారంభం కానుంది.

8లో



ప్రాణాలంటే పట్టింపులేదా ?

భద్రాచలం వద్ద నిర్మిస్తున్న రెండో వంతెన పనులు చేస్తున్న కార్మికులపై కాంట్రాక్ట్ సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.

10లో

గరిష్టం / కనిష్టం
28° / 25°

వాతావరణం

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ముత్తంగి అలంకరణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి మూలమూర్తులు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువు దీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

'వేజ్‌బోర్డ్ బేసిక్'పై పరిశీలన



పరిశీలన చేస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు 11వ వేజ్‌బోర్డ్ బేసిక్ వేతనాల అమలుకు సంబంధించిన నిర్ణయంపై కొత్తగూడెంలోని జీఎం కార్యాలయంలో ఆడిట్ సిబ్బంది సోమవారం చర్చించారు. కార్మికులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా కేటగిరీల వారీగా పరిశీలించారు. కార్యక్రమంలో ఏజీఎంలు బీభత్స, సామ్యుల్ సుధాకర్, ఎం.రమేష్, అధికారులు మజ్జి మురళి, జి సుధాకర్ పాల్గొన్నారు.

ప్రమాదరహిత సింగరేణే లక్ష్యం



మాట్లాడుతున్న ఏరియా జీఎం షాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ప్రాణాంతక ప్రమాదాలు లేని సింగరేణిగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురవయ్య, ఏరియా జీఎం ఎం.షాలేంరాజు అన్నారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని పీవీకే – 5 షాఫ్ట్ గని ఆవరణలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి సంవత్సరం సింగరేణిలో తరచుగా ప్రమాదాలు జరుగుతుండేవని, కానీ ఈ సంవత్సరం ప్రమాదం జరగలేదని, ఇది కార్మికులు, అధికారులు సాధించిన విజయమని చెప్పారు. పని ప్రదేశాల్లో రక్షణ చర్యలపై జూలై 1 నుంచి 31 వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఉద్యోగులు మోటార్ వాహనాలపై వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో సీటుబెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. అనంతరం అధికారులు, ఉద్యోగులు రక్షణ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం రీజియన్ సేఫ్టీ జీఎం జె.కుమారస్వామి, డీజీఎం గోపాలరాజు, ఏరియా రక్షణాధికారి ఎం. వెంకటేశ్వర్లు, పీవీకే -5 షాఫ్ట్ ఏజెంట్ రవీందర్, మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, పిట్ సెక్రటరీ సీహెచ్ రాజయ్య, టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

కదలని కాలేజీ పనులు

నత్తనడకన వైద్య కళాశాల నిర్మాణం

- బిల్లులు రాక పనులు నిలిపేసిన కాంట్రాక్టర్
- 'నర్సింగ్' భవనంలోనే కొనసాగుతున్న తరగతులు
- రవాణా సౌకర్యం లేక మెడికోల ఇక్కట్లు





అర్ధంతరంగా నిలిచిపోయిన వైద్య కళాశాల నిర్మాణ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైనప్పుడు స్థానికులు ఎంతో సంతోషించారు. ప్రభుత్వం సైతం అన్ని విభాగాలను సమన్వయం చేస్తూ అనుమతులు సాధించేవరకు అహర్నిశలు పని చేసింది. చివరకు గతేడాది 150 మంది విద్యార్థులతో కాలేజీ ప్రారంభమైంది. అంతే.. అప్పటి నుంచి అటు ప్రభుత్వం, ఇటు స్థానిక నాయకత్వం, అధికారులు కళాశాల వైపు కన్నెత్తి చూడటం లేదు.

ప్రారంభంలో ప్రత్యేక దృష్టి..

తెలంగాణ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాకో మెడికల్ కాలేజీ అనే పాలసీతో 2021లో జిల్లాకు వైద్య కళాశాలను మంజూరు చేసింది. దీనికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ కూడా వచ్చింది. ఏరియా ఆస్పత్రిని బోధనాస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసింది. 100 పడకల సామర్థ్యం ఉన్న ఆస్పత్రిని 330 పడకలకు పెంచింది. ఇతరత్రా సౌకర్యాలూ కల్పించింది. తరగతి గదులు, విద్యార్థుల హాస్టళ్ల కోసం కాకతీయ ఇంజనీరింగ్ కాలేజీ క్యాంపస్ ప్రాంగణాన్ని ఎంపిక చేసింది. ఇక్కడ మెడికల్, నర్సింగ్ కాలేజీలకు అవసరమైన భవన నిర్మాణాలను చేపట్టింది. నిర్దేశిత లక్ష్యానికి తగ్గట్టుగా మెడికల్ కాలేజీ మొదలయ్యేందుకు అన్ని ప్రభుత్వ విభాగాల వారు, ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా పని చేశారు. చివరకు ఇక్కడున్న వసతులు పరిశీలించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ 2022 – 23 విద్యాసంవత్సరంలో అడ్మిషన్లకు అనుమతులు మంజూరు చేసింది. మొదటి ఏడాది ఇక్కడ 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. అయితే తరగతులు ప్రారంభమయ్యే సమయానికి కేవలం నర్సింగ్ కాలేజీ భవనాలే సిద్ధం కావడంతో ప్రస్తుతం క్లాసులు అక్కడే జరుగుతున్నాయి.

రెండో బ్యాచ్ వస్తోంది..

నర్సింగ్ కాలేజీ భవనాల్లోనే మెడికల్ విద్యార్థులకు తరగతులు జరుగుతున్నాయి. ఇక్కడ చదువుతున్న మొదటి సంవత్సరం అబ్బాయిల కోసం మంచికంటి నగర్ ఏరియాలో, అమ్మాయిల కోసం పాల్వంచ మార్కెట్‌లో హాస్టళ్లను అద్దె భవనాల్లో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. మెడికల్ కాలేజీకి అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ గదులు, హాస్టళ్లు, మెస్, లైబ్రరీ తదితర భవనాల నిర్మాణం కోసం గతేడాది నర్సింగ్ కాలేజీ ముందున్న స్థలాన్ని ఎంపిక చేశారు. ఆగమేఘాల మీద అక్కడున్న టేకు వనాన్ని నరికేశారు. నేలను చదును చేసి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందుకోసం రూ.105 కోట్లు కేటాయించారు. మెడికల్ కాలేజీలో తొలి బ్యాచ్ విద్యార్థులు 2022 నవంబర్‌లో రిపోర్ట్ చేయడానికి వచ్చే సమయానికి పునాది దశలో పనులు జరుగుతున్నాయి. దీంతో రెండో బ్యాచ్ అడ్మిషన్ల వరకు మెడికల్ కాలేజీ భవనాలు అందుబాటులోకి వస్తాయనే నమ్మకం కలిగింది. కానీ నేటికీ పనులు అక్కడే ఉండడం గమనార్హం.

ఇవీ సమస్యలు..

మెడికల్ కాలేజీ విద్యార్థులు బోధనాస్పత్రి నుంచి హాస్టళ్లకు రాకపోకలు సాగించేందుకు ప్రత్యేకంగా బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉంది. మొదటి ఏడాది చివరి దశకు వచ్చినా బస్సుల హామీ ఇంకా అమలుకు నోచుకోలేదు. విద్యార్థుల రాకపోకలకు ఆటోలు, ఇతర ప్రైవేట్ వాహనాలే శరణ్యం. గతేడాది నవంబర్‌లో మెడికల్ కాలేజీ పనులు మొదలైనా, నిర్మాణ పనులు ఇంకా పునాదుల దశను దాటలేదు. ఈ భవనాన్ని జీ ప్లస్ టూగా నిర్మించాల్సి ఉంది. ఏడు నెలలుగా పునాదుల్లోనే కొట్టుమిట్టాడుతున్న కాలేజీ నిర్మాణ పనులు ఈ విద్యాసంత్సరానికి అందుబాటులోకి రావడం అసాధ్యం. మొదటి ఏడాది సిలబస్ ఎక్కువగా థియరీకే పరిమితం కావడం వల్ల నర్సింగ్ కాలేజీ భవనాల్లో మెడికల్ కాలేజీ నడిపించినా పెద్దగా ఇబ్బందులు రాలేదు. కానీ రెండో ఏడాది నుంచి థియరీతో పాటు ప్రాక్టికల్స్ కూడా చేయాల్సి ఉంటుంది. ఈ అంశం మెడికోలకు ఇబ్బందిగా మారే అవకాశం ఉంది.

ఆగిన పనులు

మెడికల్ కాలేజీ అనుబంధ భవనాల నిర్మాణం కోసం రూ.105 కోట్లు కేటాయించారు. నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ ఆరంభంలో చకచకా పనులు చేపట్టింది. అయితే పనులకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి బిల్లులు మంజూరు కాలేదు. దీంతో గత మూడు నెలలుగా పనుల్లో వేగం తగ్గుతూ వస్తోంది. జిల్లాకు తలమానికమైన వైద్య కళాశాల నిర్మాణ పనుల పట్ల ఇటు మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు, అటు అధికారులు సైతం ప్రత్యేక శ్రద్ధ చూపించడం లేదు. కాలేజీకి అనుమతి సాధించే వరకు చూపిన వేగం, శాశ్వత భవనాల నిర్మాణంలో లోపించింది. బిల్లుల చెల్లింపులో అంతులేని జాప్యం జరుగుతుండటంతో నిర్మాణ పనులు దక్కించుకున్న సంస్థ ఇక్కడున్న కార్మికులు, ఇతర మెటీరియల్‌ను వేరే పనులకు తరలిస్తోంది. ఫలితంగా గత రెండు వారాలుగా మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఎక్కడివక్కడే నిలిచిపోయాయి.

నా కొడుకు మన్యం బిడ్డే..

- మధుర జ్ఞాపకాలతో జిల్లా నుంచి వెళుతున్నా
- వీడ్కోలు సభలో బదిలీ అయిన కలెక్టర్ అనుదీప్
- రాష్ట్ర రాజధాని కాదు.. ఢిల్లీ వరకు వెళ్లడం ఖాయమన్న వక్తలు



వేదికపై కలెక్టర్ అనుదీప్ దంపతులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): అందరి సహకారంతో జిల్లాను అభివృద్ధి వైపు పయనింపజేయగలిగామని బదిలీపై వెళ్తున్న కలెక్టర్ అనుదీప్ అన్నారు. జిల్లా ప్రజల ప్రేమాభిమానాలు మరువలేనివన్నారు. ఎన్నో మధురమైన జ్ఞాపకాలు, అనుభూతులతో ఇక్కడి నుంచి వెళుతున్నానని చెప్పారు. అనుదీప్ బదిలీ అయిన సందర్భంగా ఐడీఓసీలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2019లో తనకు శిక్షణా కలెక్టర్‌గా జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారని, భద్రాద్రి కొత్తగూడెం అంటే చాలా దూరమని మొదట అనుకున్నానని, కానీ జిల్లా ఇంతగా ఆదరిస్తుందని అనుకోలేదని అన్నారు. తనకంటే ముందు కలెక్టర్లు రజత్‌కుమార్ శైనీ, ఎంవీ రెడ్డి వద్ద పనిచేయడంతో ఎన్నో నేర్చుకున్నానని తెలిపారు. క్లిష్టమైన పరిస్థితుల్లో అదనపు కలెక్టర్ సలహాలు, సూచనలు ఉపయోగపడ్డాయని చెప్పారు. పోడు సమస్య పరిష్కారంలో ఐటీడీఏ పీఓ, డీఎఫ్‌ఓల సహకారం మరువలేనిదన్నారు. ఎస్పీలు సునీల్‌దత్, వినీత్ కూడా ఎంతగానో సహకరించారని, విధుల నిర్వహణలో సిబ్బంది సైతం అద్భుతంగా పనిచేశారని అభినందించారు. ముఖ్యంగా గోదావరి వరదల సమయంలో ప్రతి ఒక్కరూ ఎంతగానో కష్టపడ్డారని అన్నారు. తన బాధ్యతల్లో సతీమణి సైతం ఓ స్నేహితురాలిగా సహకారం అందించారని, తన కుమారుడు మన్యం బిడ్డేనని చెప్పారు. తల్లిదండ్రులు నేర్పిన సిద్ధాంతాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. భద్రాద్రి రాముడితో పాటు పరిపాలనా ఓనమాలు నేర్పిన జిల్లాకు ఎప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. అనంతరం పలువురు అధికారులు మాట్లాడుతూ.. జాతీయ ర్యాంకర్‌గా ఖ్యాతిని ఆర్జించడమే కాదు.. మొదటి సారి సొంత రాష్ట్రంలో, అదీ ఆదివాసీ జిల్లా అయిన భద్రాద్రిలో మొదటి పోస్టింగ్ సాధించిన అనుదీప్ భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధిస్తారని అన్నారు. ఇప్పుడు రాష్ట్ర రాజధాని అయిన హైదరాబాద్ జిల్లాకు కలెక్టర్‌గా వెళుతున్నారని, ముందు ముందు దేశ రాజధాని ఢిల్లీలో కూడా సత్తా చాటడం ఖాయమని చెప్పారు. అనంతరం కలెక్టర్ అనుదీప్‌ను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి డీఆర్‌ఓ అశోకచక్రవర్తి అధ్యక్షత వహించగా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రెండో విడతలో 1500 మందికి..

- బీసీలకు ఆర్థిక సాయం పంపిణీకి కసరత్తు
- ఈనెల 25 లోపు లబ్ధిదారుల ఖాతాల్లో జమ

కొత్తగూడెంరూరల్: వెనుకబడిన వర్గాల్లోని కుల వృత్తిదారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అందించనున్న ఆర్థిక సాయం పంపిణీకి అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే తొలి విడతలో 50 మందికి రూ.లక్ష చొప్పున అందించగా, రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 1500 మందికి పంపిణీ చేయనున్నారు. ఒక్కో నియోజకవర్గానికి 300 మంది చొప్పున లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. బీసీల్లో కుల వృత్తిదారులకు సాయం అందించేందుకు ప్రభుత్వం గత నెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించగా కొత్తగూడెం, పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు, భద్రాచలం నియోజకవర్గాల నుంచి 13,657 మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి పది మంది చొప్పున 50 మందికి రూ. 50 లక్షలు అందజేశారు. మొత్తం దరఖాస్తుల్లో ఇప్పటివరకు 10,603 పరిశీలించగా, ఇకా 3,054 అప్లికేషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. కాగా, రెండో విడతలో ఎంపిక చేసిన 1500 మందికి ఈనెల 25వ తేదీలోపు వారి ఖాతాల్లో రూ.లక్ష చొప్పున జమ చేయనున్నారు. ప్రతినెలా కొందరు లబ్ధిదారులను ఎంపిక చేసి, ఆర్థిక సాయం అందించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇక ఎంబీసీలోని 35 కులాల వారికి కూడా దశల వారీగా ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

నియోజకవర్గానికి 300 మంది..

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఒక్కో నియోజకవర్గానికి 300 చొప్పున మొత్తం 1,500 మంది లబ్ధిదారుల ఎంపిక పూర్తయింది. వీరికి రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం పంపిణీ చేయనున్నాం. ఇందుకోసం నియోజకవర్గాల వారీగా ఏర్పాట్లు చేస్తున్నాం.

– ఇనుపనూరి ఇందిర, బీసీ సంక్షేమ శాఖ ఈడీ

బోడకాకర @రూ.400



మార్కెట్‌లో ఇప్పటికే కూరగాయల ధరలు భగ్గుమంటున్నాయి. టమాటా ధర కేజీ రూ.150కి చేరువలో ఉండగా, ఇతర కూరగాయలు సైతం రూ.50పైగానే పలుకుతున్నాయి. చికెన్ రూ.200 దాటింది. ఇక ఇప్పుడిప్పుడే సీజన్ ప్రారంభమవుతున్న బోడకాకర కాయలు రూ.400కు కిలో చొప్పున విక్రయిస్తున్నారు. వర్షాలు పడగానే అడవుల్లో లభించే బోడకాకర కాయలకు ప్రతి సంవత్సరం విపరీతమైన డిమాండ్ ఉంటుంది. కానీ ఈ ఏడాది ఉన్నంత ధర గతంలో ఎప్పుడూ లేదని వినియోగదారులు అంటున్నారు. ఎంతోమంది ఇష్టంగా తినే బోడకాకర కాయ ధర మండిపోతుండడంతో సామాన్యులు వాటివైపు కన్నెత్తి కూడా చూడడం లేదు.

– పాల్వంచరూరల్

కాంగ్రెస్‌కు మద్దతిస్తే అంతే...

- ఉచిత విద్యుత్‌ను మరిచిపోవాల్సిందే
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి అజయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ

చింతకాని: కాంగ్రెస్ పార్టీకి మద్దతిస్తే ఉచిత విద్యుత్ పథకాన్ని రద్దు చేస్తారని, తద్వారా రైతులు కరెంట్‌ను మరిచిపోవాల్సి వస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన సమావేశంలో మంత్రి పువ్వాడ ప్రసంగించారు. రైతు సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ అనుచితమని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. 2017లో అసెంబ్లీ సాక్షిగా వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని ప్రకటించినట్లుగానే సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో 7,800 మెగావాట్లు ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని నేడు 18 వేల మెగావాట్లకు చేర్చారని, సబ్‌స్టేషన్ల నిర్మాణం కోసం రూ.30 వేల కోట్లు వెచ్చించారని వెల్లడించారు. వ్యవసాయాన్ని పండుగ చేస్తుండడంతో రైతులు బాగుపడుతుండగా ఓర్వలేని కాంగ్రెస్ నేతలు తప్పుడు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

చంద్రబాబు ఏజెంట్

సాగుకు 24 గంటల విద్యుత్ ఇవ్వడంతో పాటు ప్రాజెక్టుల నిర్మాణంతో రాష్ట్రంలో వ్యవసాయం పండుగలా సాగుతోందని మంత్రి పువ్వాడ వెల్లడించారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు మాదిరిగానే రేవంత్‌రెడ్డి కూడా మాట్లాడుతూ ఆయన ఏజెంట్‌లా పనిచేస్తున్నారని మండిపడ్డారు. ఇక ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ లీడర్ కాదని.. చూసి చదివే రీడర్ అని ఎద్దేవా చేశారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేసి తీరుతామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల వెంకటేశ్వరరావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి మహర్దశ!

- ఇల్లెందు హాస్పిటల్ అప్‌గ్రేడ్‌కు త్వరలో జీఓ
- 100 పడకలకు పెంచాలని సీఎంను కోరిన ఎమ్మెల్యే హరిప్రియ
- అందుబాటులోకి రానున్న అదనపు వైద్యసేవలు
- విస్తరిస్తే స్థలం సరిపోయేనా అనే అనుమానాలు



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాల

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రికి మంచి రోజులు రాబోతున్నాయి. ఈ హాస్పిటల్ 100 పడకలకు అప్‌గ్రేడ్ కాబోతోంది. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేయాలని ఇటీవల సీఎం కేసీఆర్‌ను స్థానిక ఎమ్మెల్యే హరిప్రియ కలిసి కోరగా, ఈ మేరకు కేసీఆర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. దీనిపై వారం రోజుల్లో జీఓ వచ్చే అవకాశం ఉందని సమాచారం. మూడు నెలల క్రితం రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఇల్లెందుకు వచ్చినప్పుడు కూడా ఆస్పత్రిని 100 పడకలకు విస్తరించాలని హరిప్రియ కోరారు. దీంతో ఆయన అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం ఉందా అని వైద్యారోగ్యశాఖ నుంచి నివేదిక తెప్పించుకున్నారు. నిత్యం 500 నుంచి 800 మంది వరకు ఓపీ ఉంటోందని, ఇన్ పేషెంట్ల సంఖ్య కూడా 50కి తగ్గకుండా ఉందని అధికారులు నివేదిక సమర్పించడం, ఎమ్మెల్యే కూడా సీఎంను కోరడంతో విస్తరణకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

పెరగనున్న వైద్యులు, సిబ్బంది..

100 పడకల ఆస్పత్రిగా మారితే 200 మంది వరకు వైద్య నిపుణులు, సిబ్బందిని నియమించే అవకాశం ఉంది. స్పెషలిస్ట్ సివిల్ సర్జన్లు ఆరుగురు, సివిల్ సర్జన్(ఆర్‌ఎంఓ) ఒకరు, డిప్యూటీ సివిల్ సర్జన్‌లు తొమ్మిది మంది, అసిస్టెంట్ సివిల్ సర్జన్ ఒకరు, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు 35 మంది, స్టాఫ్ నర్సులు 23 మంది, ఏఎన్‌ఎంలు, నర్సింగ్ సూపరింటెండెంట్లు, ఫార్మసిస్టులు, ఆర్థోపెడిక్ థియేటర్ అసిస్టెంట్లు, ల్యాబ్ టెక్నీషియన్లు, జూనియర్ అసిస్టెంట్లు, హెడ్ నర్సులు.. మొత్తంగా 100 మంది వరకు పని చేయాల్సి ఉంటుంది.

స్థలం సరిపోయేనా..?

ఇల్లెందు ప్రభుత్వ ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయితే సౌకర్యాల కల్పన సాధ్యమేనా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం 30 పడకల హాస్పిటల్‌కే సరిపడా సదుపాయాలు లేవు. పడావుపడిన పాత భవనాన్ని మరమ్మతులు చేసి వాడుకలోకి తీసుకొచ్చారు. ఇక వర్షాకాలంలో పేషెంట్ల సంఖ్య పెరిగితే అదనపు పడకలు వేసేందుకు కూడా గదులు లేవు. 100 పడకలకు విస్తరిస్తే నిత్యం మూడు షిఫ్టులకు సరిపడా వైద్యులు, సిబ్బందిని నియమించాలి. కనీసం 1000 ఓపీ, 100 పడకలకు తగ్గకుండా ఇన్ పేషెంట్లు ఉండే అవకాశం ఉంది. నియోజకవర్గంలోని ఐదు మండలాలతో పాటు కారేపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల నుంచి కూడా పేషెంట్లు వస్తారు. ఇందుకోసం తగిన భవనం నిర్మించాలంటే గోవింద్ సెంటర్‌లో అటవీ శాఖ ఖాళీ స్థలం లేదా జేకే ఏరియాలోని సింగరేణి క్వార్టర్ ప్రాంతం అయినా అనువుగా ఉంటాయని స్థానికులు అంటున్నారు.

మార్పు మొదలైందిలా..

ఈ ఆస్పత్రిని వైద్యారోగ్య శాఖ నుంచి వైద్య విధాన పరిషత్‌కు బదలాయిస్తూ ఏడాది క్రితం ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో వైద్యులు, సిబ్బంది సంఖ్య పెరిగింది. పేషెంట్ల రాక కూడా ఎక్కువైంది. ఇక 100 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయితే మరింత మెరుగైన వైద్యం ఇల్లెందులోనే పొందే అవకాశం కలుగుతుంది. ప్రస్తుతం 12 మంది వైద్యులు సేవలందిస్తుండగా.. 100 పడకల ఆస్పత్రిగా మారితే 30 మంది వరకు వైద్యులు, 60 మంది నర్సులు, 40 మంది ఇతర సిబ్బంది అందుబాటులో ఉంటారు.

త్వరలో జీఓ రావచ్చు



ఇల్లెందు ప్రభుత్వ వైద్యశాలను 100 పడకలకు విస్తరించే అవకాశం ఉంది. ఈ మేరకు త్వరలో జీఓ రావచ్చు. దీంతో అత్యవసర వైద్యం అవసరమైన వారిని ఆదుకునే చాన్స్ లభిస్తుంది. రక్త శుద్ధి కేంద్రం అందుబాటులోకి వస్తుంది. జిల్లాలోని మారుమూల ప్రాంతాలకు వైద్యసేవలు విస్తరించినట్లు అవుతుంది. ఇప్పటికే భద్రాచలం, మణుగూరులో 100 పడకల ఆస్పత్రులు పని చేస్తున్నాయి.

– డాక్టర్ జి.రవిబాబు, డీసీహెచ్‌ఎస్

ఇందిరమ్మ రాజ్యం కోసమే పాదయాత్ర

- దోపిడీదారుల నుంచి తెలంగాణను కాపాడుకుంటాం
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క



మధిర : సభలో మాట్లాడుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క

మధిర: దోపిడీదారుల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని కాపాడడంతో పాటు ఇందిరమ్మ రాజ్యాన్ని ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పాదయాత్ర చేశానని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. పాదయాత్ర ముగిశాక తొలిసారిగా ఆయన సోమవారం మధిర నియోజకవర్గ పర్యటనకు వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దెందుకూరు వద్ద ఘన స్వాగతం పలకగా, అక్కడి నుంచి మోటార్ సైకిళ్లపై ర్యాలీగా భట్టి, నాయకులు తరలివచ్చారు. అనంతరం మధిరలోని కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన సభలో భట్టి మాట్లాడుతూ మధిర నియోజకవర్గ ప్రజలు, ఖమ్మం జిల్లా ప్రజలు తలదించుకునే పని ఎప్పటికీ చేయనని తెలిపారు. పాదయాత్రలో ప్రజలు పడుతున్న బాధలను చూసి చలించిపోయానని చెప్పారు. ఓదశలో ఎండ తట్టుకోలేక పాదయాత్రను నిలిపివేద్దామని అనుకున్నా... పేదల కష్టాలు తెలుసుకునేందుకే ముందుకు సాగానని వెల్లడించారు. నిధులు, నీళ్లు, నియామకాల కోసం కాంగ్రెస్ తెలంగాణను ఏర్పాటుచేస్తే.. నాడు డిప్యూటీ స్పీకర్ హోదాలో ఉన్న తాను బిల్లును పాస్ చేశానని గుర్తుచేశారు. అయితే, తెలంగాణ ప్రజల ఆకాంక్షను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నెరవేర్చకుండా దోచుకోవడమే లక్ష్యంగా పనిచేస్తోందని మండిపడ్డారు. కాగా, వచ్చే ఎన్నికల్లో పార్టీ శ్రేణులు, ప్రజల సహకారంతో ఉమ్మడి జిల్లాలో పదికి పది స్థానాలు గెలుస్తామని భట్టి ధీమా వ్యక్తం చేశారు. అనంతరం భట్టిని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

రానున్నది కాంగ్రెస్ ప్రభుత్వమే

ఎర్రుపాలెం: రాబోయే ఎన్నికల్లో గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసేది కాంగ్రెస్సేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నియోజకవర్గానికి వచ్చిన ఆయనకు తెలంగాణ – ఏపీ సరిహద్దు వద్ద నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలకగా, ఆ ఆతర్వాత మోటార్ సైకిళ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎర్రుపాలెం మండల పరిషత్ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తున్న పంచాయతీ కార్మికులను కలిసి భట్టి వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. ఆతర్వాత అంబేద్కర్ విగ్రహం, బనిగండ్లపాడులో మాజీ మంత్రి శీలం సిద్దారెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు. ఆతర్వాత రాజులదేవరపాడులో కార్యకర్తలను ఉద్దేశించి భట్టి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వివరిస్తూనే, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలుచేయనున్న పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశాల్లో ఖమ్మం డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ అయిలూరి వెంకటేశ్వరరెడ్డి, శీలం ప్రతాపరెడ్డి, రాయల నాగేశ్వరరావు, మోదుగు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఈత పోటీలకు 17 మంది ఎంపిక


ఎంపిక పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

సింగరేణి(కొత్తగూడెం): సికింద్రాబాద్‌లో ఈనెల 29, 30వ తేదీల్లో జరగనున్న రాష్ట్ర స్థాయి ఈత పోటీల్లో పాల్గొనేందుకు భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల నుంచి క్రీడాకారులకు ఎంపిక చేశారు. ఇందుకోసం సోమవారం కొత్తగూడెంలోని సీఈఆర్ క్లబ్‌లో స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జి.హన్మంతరావు రాజు ఆధ్వర్యాన పోటీలు నిర్వహించారు. అనంతరం ఉమ్మడి జిల్లా నుంచి 17 మందిని క్రీడాకారులను ఎంపిక చేశామని తెలిపారు. అసోసియేషన్ బాధ్యులు ఎం.ఎల్.నరసింహం, ఎంసీ పాసినెట్, ఆర్.నరహరి, సామ్యేల్, సుమంత్, డి.రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు టేకు కలప వేలం

భద్రాచలంటౌన్: భద్రాచలం అటవీశాఖ ఆధ్వర్యంలో డిపోలో నిలువ ఉన్న నాణ్యమైన కలపకు నేడు వేలం పాట నిర్వహించనున్నట్లు ఎఫ్‌ఆర్‌ఓ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మంగళవారం ఉదయం 9 గంటలకు భద్రాచలం అటవీశాఖ కార్యాలయంలోని కలప డిపో వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలని కోరారు.

బీటీపీఎస్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి


కార్మికుడు సచిత్ మోహత్ మృతదేహం

మణుగూరు రూరల్ : భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని రెండో యూనిట్‌లో మరమ్మతులు చేస్తూ ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. బిహార్ రాష్ట్రానికి చెందిన సచిన్ మోహత్ కుబేర్ ప్రైవేట్ కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. రెండో యూనిట్‌లో కంపెనీ నిర్వహిస్తున్న పనుల్లో భాగంగా సచిన్ చిమ్నీపై మరమ్మతు పనులు నిర్వర్తిస్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చిమ్నీపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బీటీపీఎస్ యాజమాన్యం గుట్టుచప్పుడు కాకుండా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. కొందరు కార్మికుల ద్వారా ప్రమాద సమాచారం అందుకున్న సీఐ ముత్యం రమేష్ సంఘటనా ప్రాంతానికి చేరుకుని ప్రమాదానికి కారణాలు, వివరాలు సేకరించారు. విచారణ చేపట్టారు. ప్రమాదానికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

రెండు నెలల మాసం.. శ్రావణం!

- నేటి నుంచి అధిక శ్రావణ మాసం
- ఈ నెలంతా శుభకార్యాలకు విరామం
- ఆగస్టు 17 నుంచి మొదలయ్యే నిజ శ్రావణంలోనే మళ్లీ కార్యాలు



భద్రాచలంఅర్బన్/కొత్తగూడెం టౌన్: ఈ ఏడాది శ్రావణ మాసానికి ఓ ప్రత్యేకత ఉంది. ఏటా నెల పాటు మాత్రమే ఉండే శ్రావణమాసం ఈ ఏడాది రెండు నెలల పాటు ఉండనుంది. ఇందులో ఓ మాసం అశుభకరం.. మరొకటి శుభకరమని పండితులు చెబుతున్నారు. శ్రావణమాసం అనగానే హిందువులు శుభకార్యాలను నిర్వహించుకునే నెలగా భావిస్తారు. అయితే నేటి(మంగళవారం) నుంచి శ్రావణం మొదలవుతున్నా దీనిని అధిక శ్రావణమాసంగా పిలవనుండడంతో శుభకార్యాలు నిర్వహించడానికి వీలుండదు. ఇక ఆగస్టు 17 నుంచి వచ్చే రెండో(నిజ) శ్రావణమాసంలో మాత్రం శుభ కార్యాలు నిర్వహించుకునేందుకు అవకాశం ఉంది.

మూడేళ్లకోసారి ఒక నెల అధికం

ప్రతీ మూడేళ్లకోసారి ఒక నెల అధికంగా వస్తుంది. ఈ సంవత్సరం తెలుగు క్యాలెండర్‌లో 13 నెలలు ఉండగా.. దీనిలో శ్రావణ మాసం రెండుసార్లు వచ్చింది. అంటే అధిక మాసం రావడంతో మొదటి నెలకు అధిక శ్రావణంగా, రెండో మాసాన్ని నిజ శ్రావణమాసంగా పిలుస్తారు. సూర్య, చంద్రుల కాలగణన ఆధారంగా ప్రతీ మూడేళ్లకోసారి వచ్చే అధిక మాసం ఈ ఏడాది శ్రావణ మాసంలో.. 19 ఏళ్ల తర్వాత వచ్చిందని, మళ్లీ 2042లో వస్తుందని పండితులు స్పష్టం చేస్తున్నారు. అధిక మాసాన్ని పురుషోత్తమ మాసంగా పిలవనుండగా.. మత విశ్వాసాల ప్రకారం ఎలాంటి శుభ కార్యాలు నిర్వహించరు.

నేటి నుంచి అధిక శ్రావణమాసం

ఆషాఢ మాసం సోమవారంతో పూర్తి కాగా, మంగళవారం నుంచి శ్రావణ మాసం ఆరంభమవుతోంది. ఆగస్టు 16 వరకు అధిక శ్రావణ మాసంగా ఉండనుండగా.. ఈ నెలలో ఎలాంటి శుభకార్యాలు తలపెట్టరాదని పండితులు సూచిస్తున్నారు. అలాగే, ప్రత్యేక పూజలు చేయకపోవటం మంచిదని చెబుతున్నారు. ఈ మాసం శ్రీమహా విష్ణువుకు ప్రీతికరమైనది కాగా పురుషోత్తమ మాసంగా పేరు ప్రసాదించారు. ఈ మాసంలో చేపట్టే దైవ కార్యాలు ఫలాలను ఇస్తాయని పురాణాలు చెబుతున్నాయి. ఈ మాసంలో విష్ణుసహస్రనామాలు పఠించటం, పితృ ఆరాధన, దాన ధర్మాలు వంటివి చేయటం మంచిదని వెల్లడించిన పండితులు.. వివాహాలు చేయడం, నూతన వ్యాపారాలు ఆరంభించడం, ఆస్తి కొనుగోళ్లు, ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన, ఉపనయనం వంటి కార్యక్రమాలు చేపట్టొద్దని సూచిస్తున్నారు.

నెల ఆగితేనే 'నిజ శ్రావణం'

అధిక శ్రావణ మాసం ఆగస్టు 16తో ముగిశాక 17 నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభమవుతుంది. ఈ నెలంతా ఏటా శ్రావణంలో జరుపుకున్నట్లుగా ప్రత్యేక పూజలు, శుభ కార్యాలు జరుపుకోవచ్చని అర్చకులు తెలిపారు. సెప్టెంబర్ 15 వరకు కొనసాగే నిజ శ్రావణంలో పండుగలు, శుభ కార్యాలే కాక శ్రావణ శుక్రవారం, వరలక్ష్మీ వ్రతాలు జరుపుకోవడం, వివాహాలు, గృహ ప్రవేశాలు, నూతన వ్యాపారాల ఆరంభం, నూతన గృహాల శంకుస్థాపనలు వంటివి నిర్వహించవచ్చని పండితులు పేర్కొంటున్నారు.

ఆగస్టు వరకు ముహూర్తాలు లేవు...



అధిక శ్రావణ మాసం కారణంగా ఆగస్టు నెల వరకు వివాహాలకు ముహూర్తాలు లేవు. ఇతర శుభకార్యాలు చేయడం కూడా మంచిది కాదు. ఆగస్టు 17 నుంచి నిజ శ్రావణ మాసం ప్రారంభం అవుతుంది. అప్పుడే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఏదైనా శుభకార్యాలు చేయాలనుకునే వారు పురోహితులను సంప్రదించి సరైన తేదీ ఎంచుకుంటే మంచిది. – విశ్వనాథశర్మ, ఉద్యోగ, అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు, భద్రాచలం

ఇది శూన్యమాసం



నేటి నుంచి అధిక శ్రావణ మాసం మొదలవుతుంది. ఈనెలలో శుభకార్యాలు నిర్వహించడానికి అవకాశం లేదు. అధిక శ్రావణమాసం శూన్యమాసం కావడంతో శుభకార్యాలు ఆచరించడానికి వీలు కాదు. వివాహం, గర్భదానం, గృహారంభం, గృహ ప్రవేశం వంటివి ఆచరించరాదు. నిజ శ్రావణమాసం ప్రారంభమయ్యాకే మళ్లీ శుభ ముహూర్తాలు ఉన్నాయి. – దండిబొట్ల రామాంజనకుమారశర్మ, వేదపండితులు, కొత్తగూడెం

కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షం

ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


మాట్లాడుతున్న రేగా కాంతారావు

గుండాల: సీఎం కేసీఆర్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉన్నదని, రైతుల ఊపిరిగా కేసీఆర్ ఉన్నారని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్‌పై సోమవారం గుండాల, ఆళ్లపల్లిలలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రైతులతో సమావేశాలు నిర్వహించారు. వ్యవసాయానికి కేవలం మూడు గంటల కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ సమావేశాలు జరిపారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లడుతూ కాంగ్రెస్, బీజేపీలది మోసపూరిత చరిత్ర అని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక కోట్లాది రూపాయలు ఖర్చు చేసి రైతులకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నారని, దీంతో రైతులు పంటలు పండించుకరని సుఖంగా ఉన్నారని తెలిపారు. ఇది చూసి కాంగ్రెస్ నాయకులు తట్టుకోలేకపోతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు లేక రైతులు వ్యవసాయం వదిలేసి వలస వెళ్లేవారని, ప్రస్తుతం పూర్తిస్థాయి విద్యుత్ సరఫరాతో రైతులు తిరిగి స్వగ్రామలకు వచ్చి వ్యవసాయం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయాన్ని అందించాలని కోరారు. అనంతరం ఆళ్లపల్లి మండలంలో పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.

నిరంతరాయ విద్యుత్ కేసీఆర్ ఘనతే..

ఎమ్మెల్సీ తాతా మధు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మధు, పక్కన ఎమ్మెల్యే రాములునాయక్ తదితరులు

జూలూరుపాడు: వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని ఎమ్మెల్సీ, బీఆర్‌ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ అన్నారు. సోమవారం పడమటనర్సాపురం రైతు వేదికలో 24 గంటల ఉచిత విద్యుత్‌పై నిర్వహించిన రైతు సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను భవిష్యత్‌లో కూడా బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొనసాగిస్తుందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో రైతులు ప్రశాంతంగా ఉండటంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓర్వలేక పోతున్నారని విమర్శించారు. వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి మూడు గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పటం రైతులను ఆందోళనకు గురి చేస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రైతులకు వ్యతిరేకంగా చేస్తున్న వ్యాఖ్యలను ఖండించాలన్నారు. అనంతరం 24 గంటల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని ఏకగ్రీవంగా రైతులు తీర్మానం చేశారు. కాగా తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జూలూరుపాడు ఎంపీపీ లావుడ్యా సోనీ, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ ఎర్రపల్లి వీరభద్రం, బీఆర్‌ఎస్ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు, జిల్లా నాయకులు యల్లంకి సత్యనారాయణ, వేల్పుల నరసింహారావు, మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, రోకటి సురేష్, చౌడం నరసింహారావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, రైతులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి ఆగంతకుడు..

ఇల్లెందులో రాత్రి వేళ గుర్తు తెలియని వ్యక్తి సంచారం


సీసీ కెమెరాలో నిక్షిప్తమైన ఆగంతకుడి దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందులోని సింగరేణి కార్మికవాడల్లో అర్ధరాత్రి ఓ ఆగంతకుడు సంచరించిన సంఘటన సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. పట్టణంలోని అయ్యప్ప టెంపుల్ మొదటి లైన్‌లో శనివారం తెల్లారుజామున 3.35 గంటల ప్రాంతంలో 20 ఏళ్ల లోపు వయసు ఉన్న ఆగంతకుడు ముఖానికి మంకీ క్యాప్, మాస్క్ ధరించి కొన్ని ఇళ్లల్లోకి చొరబడే ప్రయత్నం చేశాడు. ఈ సంఘటన ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. ఇల్లెందులోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో పని చేస్తున్న క్రాంతి, సింగరేణి స్కూల్‌లో పని చేస్తున్న ఆయన సతీమణి కృష్ణవేణి నివాసం ఉంటున్న సింగరేణి క్వార్టర్‌లోకి చొరబడే ప్రయత్నం చేశాడు. వారి క్వార్టర్ ముందు కిటికీ తీసి ఇంట్లోకి మొబైల్ టార్చ్ వేసి చూశాడు. ఇంట్లోని కుక్క గమనించి అరవడంతో ఇంటి యజమాని కృష్ణవేణి నిద్ర లేచింది. కిటికీ ముందు నిలబడిన ఆగంతకుడు మొబైల్ టార్చ్ వేసుకుని చూస్తుండటంతో భయపడిన కృష్ణవేణి కేకలు వేసింది. ఆ సమయంలో భర్త క్రాంతి ఊరెళ్లాడు. పక్కింటివారికి ఫోన్ చేయగా, వారు నిద్రలేచి వెతికినా అప్పటికే ఆగంతకుడు పారిపోయాడు. అదే లైన్‌లో మరికొన్ని ఇళ్లల్లోకి చొరబడేందుకు ప్రయత్నించిన దృశ్యాలు కూడా సీసీ కెమెరా ఫుటేజీలో నిక్షిప్తమయ్యాయి. గతేడాది వేసవిలో కూడా ఇదే తరహాలో పట్టణంలో దుండుగులు చోరీలకు పాల్పడ్డారు. తాజాగా సింగరేణి కాలనీలో ఆగంతకుడి సంచారంతో పట్టణవాసులు ఆందోళన చెందుతున్నారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం?

డబ్బు చెల్లించి రాజీ కుదుర్చుకున్నట్లు ప్రచారం

జూలూరుపాడు: ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయొద్దని అధికారులు హెచ్చరిస్తున్నా కొందరు తీరు మారడం లేదు. తాజాగా జూలూరుపాడులోని ఓ మహిళా ఆర్‌ఎంపీ నిర్వాకంతో వైద్యం వికటించిన ఘటన సోమవారం వెలుగు చూసింది. చంద్రుగొండ మండలానికి చెందిన ఓ వ్యక్తి జూలూరుపాడులోని ఆర్‌ఎంపీ వద్దకు రాగా, ఇంజెక్షన్ చేయడంతో అది వికటించి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో మహిళా ఆర్‌ఎంపీని ప్రశ్నిస్తే తనకు సంబంధం లేదని బుకాయించింది. ఆయనను కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా పరీక్షించి ఆపరేషన్ చేయాలని చెప్పారు. అనంతరం మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించారు. అయితే, బాధితుడి కుటుంబసభ్యులు మహిళా ఆర్‌ఎంపీని నిలదీయగా, కొంతడబ్బు చెల్లించి రాజీ కుదుర్చుకున్నట్లు సమాచారం. ఈ విషయమై జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ రాకేష్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఘటన తమ దృష్టికి వచ్చిందని, సమగ్ర విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక ఇస్తామని తెలిపారు.

అక్రమంగా ఇసుక రవాణా

అడ్డుకున్న అనంతారం గ్రామస్తులు


అనంతారం వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని అనంతారం గ్రామ సమీపంలో ఉన్న వాగు నుంచి కొందరు సోమవారం తెల్లవారుజాము నుంచి ఇసుక అక్రమంగా తరలించారు. అనుమతులు లేకుండానే 10 ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండటంతో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఇసుక వాహనాల వల్ల గ్రామంలోని అంతర్గత రోడ్లు ధ్వంసమవుతున్నాయని డ్రైవర్లను నిలదీశారు. దీంతో వాగ్వాదం జరిగింది. కాగా ఒక్కో ట్రాక్టర్ ఇసుకను ప్రైవేటు వ్యక్తులకు రూ.4,200 చొప్పున విక్రయిస్తూ, ఒకే రోజులో 50 ట్రిప్పులను తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సర్పంచ్ దాసరి నాగేంద్ర, ఓ వీఆర్‌వో అక్కడి చేరుకుని వివరాలు తెలుసుకొని, అనుమతులు ఉంటేనే ఇసుక తరలించాలని చెప్పడంతో వివాదం సద్దుమణిగింది. సీసీ రోడ్ల నిర్మాణాలతో పేరుతో అనుమతులు లేకుండానే ఇసుక తరలిస్తుండగా, సంబంధిత అధికారులకు కనీసం పట్టకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది. ఓ అధికారి ముడుపులు పుచ్చుకుని అక్రమార్కులకు అండగా నిలుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారంపైతహసీల్దార్ లూథర్ విల్సన్‌ను 'సాక్షి'వివరణ కోరగా.. ఇసుక రవాణాకు డీటీ మాత్రమే అనుమతి ఇస్తారని, ఈ విషయం గురించి తనకు తెలియదని, పూర్తి వివరాలు తెలుసుకుంటానని పేర్కొన్నారు. సీసీ రోడ్లకు ఇసుక ఉచితంగా సరఫరా చేయడంపై ప్రశ్నించగా ఆయన సమాధానం దాటవేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

జూలూరుపాడు: ఒంటరి జీవితాన్ని గడపలేక మద్యానికి బానిసైన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి మృతి చెందిన సంఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ పోటు గణేష్ కథనం ప్రకారం.. జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన పిల్లి లక్ష్మీనర్సు(48)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. భర్త, పిల్లలను వదిలేసి భార్య పదేళ్ల క్రితం వెళ్లిపోయింది. దీంతో లక్ష్మీనర్సు ఇద్దరు ఆడపిల్లలను పెంచి పోషించి పెళ్లిళ్లు చేశాడు. ఒంటరిగా ఉంటున్న అతను మద్యానికి బానిస అయ్యాడు. మద్యం మత్తులో ఈనెల 14న పురుగుల మందు తాగి అపస్మాకరక స్థితిలో పడి ఉన్న ఆయనను బంధువులు కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 16వ తేదీ రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి నాగరత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేధింపుల కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: భార్యను వేధిస్తున్న భర్తపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని భగవాన్ దాస్ కాలనీకి చెందిన వినోద్ కుమార్ అనే వ్యక్తి కొంతకాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని భార్య ఉషారాణిని వేధిస్తున్నాడు. శారీరకంగా, మానసికంగా హింసిస్తున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పేకాటరాయుళ్లపై...

దమ్మపేట: మండల పరిధిలోని మొండివర్రె గ్రామ శివారులో ఉన్న పేకాట శిబిరంపై సోమవారం పోలీసులు దాడి చేశారు. రూ.3,150 నగదును స్వాధీనం చేసుకుని, పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం సహకారనగర్: గురుకులాల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చావా దుర్గాభవాని డిమాండ్ చేశారు. ఖమ్మం ధర్నాచౌక్‌లో గురుకుల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలన్నింటికీ ఒకే విధమైన సమయం, బోధన పద్ధతులు అమలుచేయాలని, పదోన్నతులు, బదిలీలు తక్షణమే నిర్వహించాలన్నారు. అలాగే, పార్ట్ టైం ఉపాధ్యాయులకు మినిమం పేస్కేల్ ఇవ్వటంతో పాటు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని, అన్ని హాస్టళ్లలో కేర్ టేకర్లను నియమించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వచ్చే నెల 5న హైదరాబాద్‌లో మహాధర్నా నిర్వహిస్తామని దుర్గాభవాని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీ.వీ.నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరావుతోపాటు లివింగ్‌స్టన్, మహేష్, దామోదర్, స్వర్ణలత, సురేష్, జితేష్, నాగేశ్వరరావు, వలీ, రాందాస్, ఉద్దండు తదితరులు పాల్గొన్నారు.

రెండు రోజుల వ్యవధిలో భార్యాభర్తల మృతి


కూనయ్య


చిట్టెమ్మ

సత్తుపల్లిరూరల్: భర్త మరణించిన రెండు రోజులకే భార్య మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం సిద్ధారంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గోళ్లమూడి కూనయ్య(79) అనారోగ్యంతో బాధపడుతూ ఈనెల 14వ తేదీన మృతి చెందాడు. అప్పటి నుంచి మనోవేదనకు గురైన ఆయన భార్య చిట్టెమ్మ (74) కూడా ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందింది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. రెండు రోజుల వ్యవధిలోనే భార్యాభర్తలు మృతి చెందటంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

గాంధీపురం రైల్వేగేట్ వద్ద మరమ్మతులు



రైల్వే గేట్ వద్ద చేపడుతున్న మరమ్మతులు

కారేపల్లి: మండలంలోని గాంధీపురం రైల్వే గేట్ వద్ద సోమవారం నుంచి రోడ్డు మరమ్మతు పనులు మొదలయ్యాయి. దీంతో ఖమ్మం నుంచి ఇల్లెందు వైపు, ఇల్లెందు నుంచి ఖమ్మం వైపు వెళ్లే వాహనాలను అధికారులు కారేపల్లి మీదుగా దారి మళ్లించారు. ఈనెల 20వ తేదీ వర కు మరమ్మతులు కొనసాగనున్నందున వాహనదారులు గమనించాలని కోరారు. కాగా, వాహనాలు కారేపల్లి మీదుగా వచ్చి వెళ్తుండడంతో రద్దీగా మారింది.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

కొత్తగూడెంరూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతిచెందిన ఘటనపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం..లక్ష్మీదేవిపల్లి మండలంలోని ప్రశాంత్‌నగర్ గ్రామపంచాయతీకి చెందిన కొక్కు మహేష్(30) ఈనెల 15న ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. సోమవారం లోతువాగు గ్రామం వద్ద మణుగూరు రైల్వేలైన్ బ్రిడ్జి కింద మృతదేహమై కన్పించాడు. స్థానికుల సమాచారంతో వెళ్లిన పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద పోలీసులు సోమవారం 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆదినారాయణ అనే వ్యక్తి ఆంధ్ర- ఒడిశా బోర్డర్ డొంకరాయి వద్ద కొని కొత్తగూడెంలో విక్రయించేందుకు వెళ్తుండగా భద్రాచలంలో పట్టుకున్నారు. గంజాయి విలువ రూ.3.20 లక్షలు ఉంటుందని సీఐ నాగరాజు రెడ్డి తెలిపారు. నిందితుడుపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. ఎస్‌ఐలు శ్రీకాంత్, మధు ప్రసాద్ పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఇల్లెందురూరల్: మండలంలోని బొజ్జాయిగూడెం సమ్మక్క–సారలమ్మ గద్దెల సమీపంలో ఉన్న అడవుల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని సోమవారం పోలీసులు గుర్తించారు. మేకల కాపరి ఇచ్చిన సమాచారంతో అటవీ ప్రాంతంలోకి వెళ్లి చెట్టుకు వేలాడుతున్న మృతదేహాన్ని గుర్తించామని సీఐ కరుణాకర్ తెలిపారు. సుమారు 15 రోజుల క్రితం మృతిచెందినట్లు తెలుస్తోందని, మృతదేహంపై ఆకుపచ్చని షర్టు, నల్లటి జీన్స్ పాయింట్ ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం ఇల్లెందు ఆస్పత్రి డాక్టర్ బన్సీలాల్ సంఘటనా స్థలంలోనే శవపరీక్ష నిర్వహించారు. అదే ప్రదేశంలో పంచాయతీ వర్కర్ల సహాయంతో ఖననం చేశారు.